ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
ఆదివారం 9 జూన్ 2024



లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం 8లో..
ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు 8లో..

జోరుగా మట్టిదందా



ముర్మూరు వద్ద డంప్ చేస్తున్న చెరువుల మట్టి



ముర్మూరు వద్ద కుప్పగా పోసిన మట్టి

- చెరువుల్లో అక్రమంగా తవ్వకాలు
- రూటు మార్చిన మాఫియా
- మంథని, రామగుండం చెరువులపై కన్ను
- రాజకీయ నాయకుల అండదండలతో అనుమతులు
- రాయల్టీకి మించి రవాణా
- విచారణ జరపాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని పలు చెరువుల్లో అక్రమ మట్టి దందా జోరుగా సాగుతున్నది. మట్టి మాఫియా ఈ ఏడాది రూట్ మార్చి మంథని, రామగుండం నియోజకవర్గాల్లోని చెరువులపై పడింది. రాజకీయ అండదండలతో చెరువులను దక్కించుకున్న ఇటుక బట్టీల యజమానులు అనుమతులకు మించి మట్టి తీసి చెరువులను కొల్లగొడుతున్నారు. ఎక్కడికక్కడే సంబంధిత అధికారులను మచ్చిక చేసుకొని దందాను యథేచ్ఛగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి వే బిల్లులు లేకుండా చెరువుల నుంచి నేరుగా మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి, ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతూ మట్టిని తరలించుకుపోతున్నారు. ఎవరు అధికారంలో ఉంటే వారిని మచ్చిక చేసుకుంటూ ఇటుక బట్టీల యజమానులు తమ వ్యాపారాన్ని, మట్టి దందాను మూడు పువ్వులు ఆరు కాయలుగా నడిపించుకుంటున్నారు. ప్రభుత్వానికి పన్నుల రూపేణా చెల్లించాల్సిన సొమ్మును చెల్లించకుండా పెద్దఎత్తున ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు.

● జిల్లాలో 160కి పైగా ఇటుక బట్టీలు..

జిల్లాలోని పెద్దపల్లి, రాఘవాపూర్, రంగంపల్లి, రామగిరి, కమాన్‌పూర్, రామగుండం, ధర్మారం, సుల్తానాబాద్, కాట్నపల్లి, తదితర ప్రాంతాల్లో 160కి పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. ఈ బట్టీల ద్వారా ప్రతి ఏటా కోట్ల రూపాయల వ్యాపారం సాగుతున్నది. ఇక్కడి నుంచి హైదరాబాద్, వరంగల్, మంచిర్యాల, తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి ఇటుక సరఫరా అవుతూ ఉంటుంది. ఇటుక తయారీకి అవసరమయ్యే చెరువుల్లో లభించే నల్ల రేగడి మట్టిని ప్రతి ఏటా వేసవి కాలంలో రాజకీయ పార్టీల అండదండలతో తరలించుకు పోతున్నారు. ఇటుక బట్టీల యజమానుల పేరిట గానీ, ఇతరుల పేరిట గాని అనుమతులు తీసుకుని కొంత మొత్తంలో రాయల్టీ, సీనరేజీ చెల్లించి పెద్ద ఎత్తున మట్టిని తరలించుకు పోతున్నారు. ఇటుక బట్టీల యజమానులు కొందరు తమకు అవసరమయ్యే మట్టిని తీసుకోవడంతో పాటు ఇతరులకు మట్టిని అమ్ముకుని లక్షలాధి రూపాయలు ఆర్జిస్తున్నారు. ప్రతిసారి పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో గల చెరువుల నుంచే ఎక్కువగా మట్టి తీసుక వెళతారు. ఎందుకంటే రవాణా భారం తగ్గుతుంది. ఈ ఏడాది కూడా ఇక్కడి చెరువుల్లో మట్టి తీసేందుకు పలువురు దరఖాస్తు చేసుకున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే విజయ రమణారావు ఎవరికి కూడా అనుమతులు ఇవ్వవద్దని నిలురించారు. దీంతో గౌరెడ్డిపేటకు చెందిన ఎన్‌టీసీ ఇటుక బట్టీల యజమాని కమాన్‌పూర్ మండలం జూలపల్లి చెరువులో మట్టి తరలింపునకు అనుమతులు తీసుకున్నాడు. మొదట 6 వేలు, ఆ తర్వాత 2 వేల టన్నుల మట్టి తరలింపునకు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాడు. కానీ రాత్రింభవళ్లు అనేక లారీల ద్వారా ఎలాంటి వే బిల్లులు లేకుండా 15 వేల టన్నులకు పైగా మట్టిని తరలించారు. అలాగే రామగుండం మం డలం అల్లూరు చెరువు మట్టిని తరలించుకునేందుకు మియాపూర్‌కు చెందిన ఒకరు అనుమతులు తీసుకుని 2 నుంచి 4 వేల టన్నులకు రాయల్టీ చెల్లించి అడ్డగోలుగా మట్టిని తరలించారు. ఈ రెండు చెరువుల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీలను ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులకు పట్టించినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు లేవు. మంథని మండలంలోని బిట్టుపల్లి చెరువులో మట్టి తవ్వ కాల కోసం అనుమతులు పొందగా, గ్రామస్తుల ఫిర్యాదుతో అనుమ తులను రద్దు చేశారు. ఆ తర్వాత వారం రోజులకు మళ్లీ అనుమతులు ఇచ్చారు. 15 వేల టన్నుల మట్టి కోసం రాయల్టీ చెల్లించినప్పటికీ, నిబం ధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● ముర్మూరు చెరువుపై కన్ను..

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీళ్ల అడుగంటడంతో ముంపునకు గురైన ముర్మూరు గ్రామంతో పాటు చెరువు తేలింది. దీంతో అక్రమార్కుల కన్ను చెరువుపై పడింది. అనుకున్నదే తడవుగా 60 వేల క్యూబిక్ మీటర్ల మట్టి కోసం పెద్దపల్లి మండలంలోగల ఏఎస్ఆర్ బ్రిక్స్ యజమాని ఏ శ్రీనివాస్, ఎస్‌హెచ్‌ఆర్ బ్రిక్స్ యజమాని ఏ సౌందర్య పేరిట అనుమతులు పొందారు. విడతల వారీగా ఏఎస్ఆర్ 14,500, ఎస్‌హెచ్‌ఆర్ 15,500 మెట్రిక్ టన్నుల మట్టికి ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించారు. ఈ చెరువులో పది భారీ ఎక్స్‌కవేటర్లు, ప్రొక్లెయిన్లు, 50కి పైగా లారీలను పెట్టి చెరువు నుంచి ఒక్కో లారీలో 30 నుంచి 40 టన్నులకు పైగా మట్టిని చెరువుకు సమీపంలోగల ప్రభుత్వ స్థలంలో డంప్ చేస్తున్నారు. ఆ మట్టి పరిమాణం తెలియకుండా ఉండేందుకు పది వరకు బ్లేడ్ ట్రాక్టర్లు పెట్టి నేర్పించి తొక్కిస్తున్నారు. ఎవరన్న అధికారులు వచ్చిన ఆ డంప్‌ను తనిఖీ చేసినా కూడా కొలతలకు దొరకుండా ఉండేందుకు మట్టిని నేర్పుతున్నారు. మట్టి తవ్వకాలపై సంబంధిత నీటి పారుదల శాఖాధికారుల పర్యవేక్షణ కరువయ్యింది. వాస్తవానికి నీటి పారుదల శాఖాధికారులు ఆయా చెరువుల్లో ఎంత లోతు పరిమాణంలో మట్టి తీసుకోవాలో పరిశీలించి అనుమతి ఇవ్వాలి. గనులు, భూగర్భ శాఖకు రాయల్టీ చెల్లించిన తర్వాత వే బిల్స్ జారీ చేయాల్సి ఉంటుంది. కానీ ఆ నిబంధనలను పక్కన పెట్టి మొత్తం బాధ్యతను కేవలం నీటి పారుదల శాఖకు మాత్రమే అప్పగించారు. దీంతో సదరు అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.



అంతర్గాం మండలం ముర్మూరు చెరువులో లారీల్లో మట్టిని పోస్తున్న ఎక్స్‌కవేటర్లు

ఓవర్‌లోడ్‌తో వాహనాలు వెళుతున్నా కూడా రవాణా శాఖాధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులకు ముడుపులు ముడుతున్నాయనే ఆరోపణలు ఉన్నారు. ఆయా గ్రామాల ప్రజలు మట్టి లారీలను పట్టుకుని అధికారులకు అప్పగించినా కూడా కేసులు నమోదు చేయడం లేదు. పెద్దపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో రాత్రివేళల్లో అక్రమంగా కొందరు ఇటుక బట్టీల యజమానులు తరలించుకుపోతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఈ వ్యవహారంపై కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత నీటి పారుదల శాఖాధికారులను పలుసార్లు వివరణ కోరగా స్పందించడం లేదు.

నేడు గ్రూపు 1 ప్రిలిమినరీ పరీక్ష

- 6098 మంది అభ్యర్థులకు 14 కేంద్రాల్లో పరీక్ష

- కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్



రామగుండం ఎన్టీపీసీలోని జడ్పీ పాఠశాల కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న అరుణశ్రీ

పెద్దపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష కోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈనెల 9న ఆదివారం పరీక్ష జరగనున్నది. 6098మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పెద్దపల్లి రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె లక్ష్మీనర్సయ్య తెలిపారు. పెద్దపల్లిలో 6 కేంద్రాలు, సుల్తానాబాద్‌లో 2 కేంద్రాలు, రామగిరిలో ఒకటి, రామగుండంలో 5 కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం కేంద్రాలను కోఆర్డినేటర్‌తో కలిసి అదనపు కలెక్టర్ అరుణశ్రీ సందర్శించి పలు సూచనలు చేశారు. వసతుల విషయంలో అభ్యర్థులు ఎవరు ఇబ్బందులు పడకుండా చూడాలని కేంద్రాల అధికారులను ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలియజేసిన సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆమె కోరారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి పరీక్షాకేంద్రంలోకి అనుమతిస్తారని, 10 గంటలలోపే పరీక్షా కేంద్రం లోపలికి చేరుకోవాలని, 10గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఐడి కార్డు, మూడు లేటెస్టు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని, షూస్ ధరించకుండా కేవలం చెప్పులు వేసుకుని రావాలని, బయో మెట్రిక్ అటెండెన్స్ ఉన్నందున అభ్యర్థులు ఎవరు కూడా మెహందీ, కోన్ లాంటివి లేకుండా చూసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ డివైజెస్, చేతి గడియారాలు, సెల్‌ఫోన్లు తీసుకొని వెళ్లడానికి అనుమతి లేదని అరుణశ్రీ తెలిపారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

- బయోమెట్రిక్ సిస్టంతో పారదర్శకంగా పరీక్షలు

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

కోల్‌సిటీ, జూన్ 8: టీజీపీఎస్‌పీ నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని, అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాలకు అనుమతి లేదని రామగుండం సీపీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషరేట్ వ్యాప్తంగా పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో 41సెంటర్లలో 15,482మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, పెద్దపల్లి జిల్లా పరిధిలో 14సెంటర్లలో 6,098 అభ్యర్థులు ఉన్నారన్నారు. పరీక్ష కేంద్రాల అడ్రస్‌లు తెలుసుకునేందుకు పట్టణ రోడ్లు, చౌరస్తాల్లో సూచన బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంచామని, పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ షాపులు తెరిచి ఉంచరాదన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకోవడం జరుగుతుందని, అభ్యర్థులు సహకరించాలని సీపీ సూచించారు. పరీక్షకు హాజరయ్యే వారికి ఉదయం 9గంటల నుంచి అనుమతి ఇస్తారని, 10గంటలకు గేట్ మూసివేయడం జరుగుతుందన్నారు. 10గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా ఎవరిని అనుమతించమని సీపీ పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఒక కలర్ ఫోటో, ఒరిజినల్ ఆధార్‌కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/ఉద్యోగి గుర్తింపుకార్డు/ఓటరు గుర్తింపుకార్డు ఏదైనా ఒకటి తప్పకుండా తీసుకురావాలన్నారు. హాల్‌టికెట్‌లో సరిగా ఫోటో కనిపించకపోయినట్లయితే మూడు కలర్ ఫోటోలు, హాల్ టికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకుని రావాలన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలను ముందుగా చూసుకోవాలన్నారు. పరీక్ష రాయడానికి బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్నులు మాత్రమే అనుమతిస్తారని, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలిక్లేటర్లు, హియరింగ్ సొల్యూషన్స్‌ను అనుమతించడం జరుగదన్నారు. 1గంట వరకు పరీక్ష కేంద్రం నుంచి ఎవరిని బయటకు అనుమతించరని, పరీక్ష రాసిన తరువాత ప్రశ్నాపత్రం తమతో తీసుకెళ్లడానికి అవకాశం ఉందని సీపీ పేర్కొన్నారు.

కార్మికులకు 35 శాతం లాభాల వాటా ప్రకటించండి

- సీఎండీ బలరాంను కోరిన జనక్‌ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 8: 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన లాభాల్లో 35శాతం కార్మికులకు ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ సింగరేణి సీఎండీ బలరాంకు విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లో సీఎండీనికి కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసి రెండు నెలలు గడుస్తున్నాయని, పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో లాభాలు ప్రకటించలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినందున సంస్థ లాభాలు ప్రకటించి, దానిలో 35 శాతం వాటా కార్మికులకు ఇవ్వాలని కోరారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 67.13మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగగా, 2222 కోట్ల లాభాల వచ్చాయని, దానిలో 32 శాతం 711.18 కోట్లు కార్మికులకు చెల్లించినట్టు తెలిపారు. గడిచిన ఆర్థికసంవత్సరంలో రికార్డుస్థాయిలో 70.12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, 37వేల కోట్ల బిజినెస్ జరిగిందన్నారు. కార్మికుల శ్రమను గుర్తించి లాభాల వాటా ఇవ్వాలని అన్నారు.

ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యల తిష్ఠ

- రోగులకు దిండ్లు లేవు.. - సమయానికి రాని టిఫిన్, భోజనం - తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న రోగులు - పట్టించుకోని అధికారులు

కళ్యాణ్‌నగర్, జూన్ 8: సింగరేణి మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. ఆసుపత్రి ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన 80పడకల భవనంలో రోగులకు కనీస సౌకర్యాలు లేక అల్లాడుతున్నారు. ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే లేడని రోగులు, వారి బంధులు ఆరోపిస్తున్నారు. కొత్త బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన పడకల్లో రోగులకు దిండ్లు కానీ, బ్లాంకెట్లు కానీ, దుప్పట్లు కానీ ఇవ్వడం లేదు. కొంత మంది రోగులకు బెడ్‌షీట్లు కూడా ఇవ్వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోగులకు ఈ భవనంలో కనీసం మంచినీటి వసతిని కూడా ఏర్పాటు చేయలేదు. మెడికల్ కళాశాల ఏర్పడిన తరువాత పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి రోజుకు 1000 నుంచి 1200మంది రోగులు వివిధ వైద్య సేవల కోసం వస్తున్నారు. దీంతో పాత భవనం, కొత్త భవనాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వివిధ వైద్య సేవల కోసం వచ్చే వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. రోజు వారీగా రోగులకు అందుతున్న సేవలపై సూపరింటెండెంట్, ఆర్‌ఎంవోలు పరిశీలించాల్సి ఉండగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముగ్గురు ఆర్‌ఎంవోలు ఉన్నా ఆసుపత్రిలో ఏం జరుగుతుందోననే విషయం వారికి తెలియకపోవడం, పాలనపరంగా వారికి పట్టు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



నూతన భవనంలో ఏర్పాటు చేసిన వార్డు



దిండు లేక ఇబ్బందులు పడుతున్న రోగి

ఇంటి నుంచే దిండ్లు, బెడ్‌షీట్లు

రోగులు ఆసుపత్రిలో అడ్మిట్ అయిన తరువాత సంబంధిత రోగికి బెడ్‌షీట్, దిండు, దుప్పటి ఇవ్వాల్సి ఉండగా అవేమి ధర్మాసుపత్రిలో ఇవ్వడం లేదు. రోగులు ఇంటి నుంచేవాటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగి తీవ్ర అనారోగ్యం బారిన పడి నీళ్లు కానీ, పాలు కానీ తాగని పరిస్థితుల్లో వారికి పుష్‌బ్యాక్ దిండు ఇవ్వాల్సి ఉంటుంది. అవి తమ తగ్గర లేవు, మీరే కొనుక్కోండని ఉచిత సలహాలు ఇస్తున్నారు. రోగులే ఇంటి నుంచి తెచ్చుకున్న బెడ్‌షీట్లను తలకింద పెట్టుకుని పడుకుంటున్నారు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమయానికి రాని టిఫిన్, భోజనం..

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఉదయం 7గంటలకు టిఫిన్, పాలు ఇవ్వాల్సి ఉండగా 10గంటలు దాటినా ఇవ్వడం లేదు. మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంట మధ్య భోజనం అందించాల్సి ఉండగా రెండు గంటలు దాటినా భోజనం పెట్టడం లేదని రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. సమయం దాటిపోతే తినడానికి ఏమి దొరకక రోగులు అల్లాడుతున్నారు.

తాగునీరు కరువు..

కొత్తగా ఏర్పాటు చేసిన 80 పడకల ఆసుపత్రిలో రోగులకు, వారి బంధువులకు కనీస తాగునీరును కల్పించడంలో ఆసుపత్రి విభాగం విఫలమైంది. మంచినీరు కావాల్సి వస్తే పాత బిల్డింగ్‌కు రావాల్సి వస్తుందని, కొత్త బిల్డింగ్‌లో ఇటీవల ఒక రియల్ ఎస్టేట్ యజమాని రోగులకు తాగునీటి కోసం వాటర్ ప్యూరిఫైడ్ యంత్రాన్ని ఇచ్చినా దానిని వినియోగించడం లేదు. దీంతో రోగులు బయట దుకాణాల్లో, పాత బిల్డింగ్‌కు వచ్చి నీటిని తీసుకెళ్లే పరిస్థితి నెలకొన్నది.

కరెంటు పోతే అంతే సంగతులు..

ఇంత పెద్ద ఆసుపత్రిలో జనరేటర్ లేకపోవడంతో రోగులు కరెంటు పోయిన సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి 12గంటలకు కరెంటు పోయి తెల్లవారుజాము వరకు రాలేదు. రోగులు చీకట్లోనే మగ్గారు. ఆసుపత్రిలో జనరల్ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఆ విషయంపై అధికారులు దృష్టి సారించకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

పట్టించుకునే వారు కరువు..

వంద పడకల ఆసుపత్రి నుంచి 362 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయిన గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ ఉన్నా లేనట్టే అవుతుంది. కింది స్థాయి అధికారులు తుతు మంత్రంగా వచ్చి విధులు ముగించుకుని వెళుతున్నారు. మధ్యాహ్నం 12గంటలు దాటితే ఆసుపత్రిని పట్టించుకునేవారే కరువయ్యారు. కేవలం ప్రిన్సిపాల్ వచ్చిన రోజే ఆసుపత్రి వైద్య సిబ్బంది నిండుగా కనబడుతుంది. ఆ తరువాత ఇక్కడ వైద్యులు కానీ, సిబ్బంది కానీ కనబడడం లేదు. రోజు వారీగా సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఆసుపత్రి పాలన సాగాల్సి ఉండగా అలా జరగడం లేదని తెలుస్తోంది.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు..

- సుమంత్‌రెడ్డి, రోగి బంధువు



నాలుగు రోజుల క్రితం మా నానమ్మను ఆసుపత్రిలో అడ్మిట్ చేశాం. ఇక్కడ సమస్యలు తిష్ఠ వేశాయి. రోగులను కనీసం పట్టించుకోవడం లేదు. దిండ్లు, బెడ్‌షీట్లు ఇవ్వడం లేదు. కరెంటు పోతే చీకట్లోనే మగ్గుతున్నాం. దీనిపై ప్రిన్సిపాల్, ఆర్‌ఎంవోలకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. వైద్య సేవలు కూడా అంతంత మాత్రంగానే అందుతున్నాయి. డ్యూటీ సమయంలో డాక్టర్లు ఉండడం లేదు. ఏది అడిగినా ఇంటి వద్ద నుంచే తెచ్చుకోవాలని సలహాలు ఇస్తున్నారు. నాలుగు రోజులుగా ఫిర్యాదు చేస్తున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదు.

9 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

- డీఈవో డి.మాధవి

పెద్దపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఈనెల 9,10 తేదీలలో ఆదివారం, సోమవారం మండల వనరుల కేంద్రం, పెద్దపల్లి నందు నిర్వహించే ధ్రువ పత్రాల పరిశీలనకు ఉదయం 10 గంటల నుంచి ఒరిజినల్ సర్వీసు బుక్, ఒరిజినల్ సర్టిఫికెట్స్ ర్యాంక్ కార్డు, అపాయింట్మెంట్ ఆర్డర్స్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకొని హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

మంథని, జూన్ 8: మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో పారిశుధ్య పనులకు సంబంధించిన పలు సమస్యలు తమ దృష్టికి రావడంతో తానే స్వయంగా వార్డులు తిరుగుతూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి వెల్లడించారు. శనివారం ఆమె పలు వార్డులను సందర్శించారు. 9వ వార్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సైతం స్థానిక కౌన్సిలర్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు తమ ఇంట్లోని వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా వార్డులలో తిరిగే చెత్తబండ్లను ఉపయోగించుకోవాలని సూచించారు. డ్రైనేజ్ నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో నీటి సరఫరాకు సంబంధించిన పైప్ లైన్లు చెడిపోవడంతో వాటిని వెంటనే పునరుద్ధరించి నీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. వార్డుల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని పేర్కొన్నారు. రానున్న రోజు ల్లో వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేప థ్యంలో అండర్ గ్రౌండ్‌డ్రైనేజ్ నిర్మాణ పను లను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చొప్పకట్ల హనుమంతు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సైదాపూర్, జూన్ 8: పురుగుల మందు తాగిన సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామా నికి చెందిన కస్తూరి బ్రహ్మాచారి(75) అనే వృద్ధుడు శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మాచారికి ముగ్గురు కూతు ళ్లు, కుమారుడు ఉన్నారు. ఏడు ఏళ్ల క్రితం కొడుకు చనిపోయాడు. అప్పటినుంచి బ్రహ్మాచారి మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం పురుగుల మందు తాగాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. బ్రహ్మాచారి కూతురు మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు

వ్యవసాయ బావిలో పడి దినసరి కూలీ మృతి

సైదాపూర్, జూన్ 8: మండలంలోని గుజ్జులపల్లి గ్రామ శివారులో వ్యవసాయ బావికి గాజులు పోస్తుండగా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన మెట్టు మొగిళి(45) అనే దినసరి కూలీ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిళి బావికి గాజులు పోసేందుకు రోజు కూలీ పనికి వస్తుండేవాడు. అదే క్రమంలో శనివారం గాజు పోస్తుండగా బావిలో పడిపోయాడు. స్థానికులు, తోటి కూలీలు బావిలో నుంచి మొగిళిని బయటకు తీసి చూడగా మృతి చెందాడు. దీనిపై ఎస్సై జన్ను ఆరోగ్యంను వివరణ కోరగా తమకు సమాచారం లేదని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని తెలిపారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

ఇద్దరిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

కొడిమ్యాల, జూన్ 8: మండలంలోని తురుకకాశీనగర్ గ్రామ శివారులోని రైల్వేగేట్ సమీపంలో శుక్రవారం రాత్రి మంగపేటకు చెందిన నల్ల పవన్, నల్ల సాగర్‌లపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు పవన్ ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ అర్షరాజు తెలిపారు. మంగపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు గంగాధర వైపు నుంచి మంగపేటకు వెళ్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు రాడ్లతో కొట్టగా గాయాలైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సుందిళ్ల బ్యారేజీని సందర్శించిన జస్టిస్ చంద్రఘోష్


బ్యారేజీ పనులను పరిశీలిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్

మంథనిరూరల్, జూన్ 8: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పెద్దపల్లి జిల్లా మంథని మండలం సుందిళ్ల వద్ద నిర్మించిన పార్వతి బ్యారేజీని జస్టిస్ పినాకి చంద్రఘోష్ శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. గతంలో జరిగిన పనులకు, ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించి ఈనెల 10వ తేదీ వరకు నివేదిక ఇవ్వాలని ఆయన నీటి పారుదల శాఖాధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అక్రమాలను గుర్తించేందుకు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ చైర్మన్‌గా విచారణ కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. శుక్రవారం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను పరిశీలించిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ బృం దం శనివారం ఉదయం సుందిళ్ల బ్యారేజీ వద్దకు చేరుకుని పైనుంచి మొత్తం పరిశీలించి కింద పనులు జరుగుతున్న చోటికి వెళ్లి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న లోపాలను ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ నిర్మాణ నమూనాలను పరిశీలించారు. నిర్మాణాన్ని అడుగడుగునా క్షుణ్ణంగా పరిశీలించి గతంలో జరిగిన లోపాలు ఉన్న వాటికి, ప్రస్తుతం జరుగుతున్న మరమ్మతు పనులకు సంబంధించి ఈనెల 10వ తేదీ నాటికి నివేదిక సమర్పిం చాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీ సందర్శనకు ముందు రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో ఉన్న అతి ప్రాచీనమైన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జస్టిస్ చంద్రఘోష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంటన ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంట ప్రశాంత్‌జీవన్ నవయుగ డైరెక్టర్ రమేశ్, జీఎం మాధవ్, ఈఎన్‌సీ ఓఅం డ్ఎం నాగేందర్, రామగుండం సీఈ సుధాకర్‌రెడ్డి, ఎస్ఈ కరుణాకర్ తదితరులు ఉన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూన్ 8: ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో భక్తుల రద్దీ పెరిగింది. సెలవురోజులు కావటం వల్ల శ్రీ లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం వరకు వరకు క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. నవ దంపతులు గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కుబే రుడిని దర్శనం చేసుకున్నారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చ కులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.

చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం

ఎల్లారెడ్డిపేట, జూన్ 8: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఈ నెల 3న నాలుగు నెలల చిన్నారి బుర్క అన్విశ్రీ జ్వరంతో మృతి చెందింది. తమ కూతురు మరణంపై అనుమానాలున్నాయని పేర్కొంటూ ఈ నెల 8న చిన్నారి తల్లి కైరుబి అలియాస్ ఇషిత స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఖననం చేసిన మృతదేహాన్ని శనివారం బయటకు తీసిన వైద్యాధికారులు పోస్టుమార్టం చేశారు. ఎల్లారెడ్డి పేట మండల కేంద్రానికి చెందిన కైరుబి అదే గ్రామానికి చెందిన బుర్క రాకేశ్‌ను ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండో సంతానమైన నాలుగు నెలల అన్విశ్రీకి గత నెల 29న స్థానిక ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. అదే రోజు చిన్నారికి జ్వరం వచ్చింది. మందులను వేసినా తగ్గలేదు. ఈ నెల 1న వాంతులు, విరేచనాలు అధికమయ్యాయి. చిన్నారిని తిరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది అందించిన మందులను వాడినా నయం కాలేదు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 3న మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పాప అప్పటికే మృతి చెందిందని వెల్లడించారు. చిన్నారి మృతదేహాన్ని స్థానిక గిద్దె చెరువు సమీపంలోని శ్మశాన వాటికలో ఖననం చేశారు. తమ కూతురు మరణానికి గల కారణాలను తెలుసుకోవాలని, చర్యలు తీసుకోవాలని చిన్నారి తల్లి కైరుబి అలియాస్ ఇషిత పోలీస్ స్టేషన్‌లో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఖననం చేసిన చిన్నారి మృతదేహానికి బయటకు తీసి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి ప్రత్యేక వైద్యాధికారుల బృందం శ్మశాన వాటికలో పోస్టుమార్టం నిర్వహించింది. ఆర్ఐ సంతోష్ సమక్షంలో పంచనామా నిర్వహించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమాకాంత్ తెలిపారు.

పోలీస్ జాగిలం మృతి


జాగిలంకు నివాళులు అర్పిస్తున్న ఎస్పీ , పోలీసులు

తంగళ్లపల్లి, జూన్ 8: ఎన్నో ఏళ్లుగా పోలీస్ సేవలు అందించిన జాగిలం రాజా అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. తంగళ్లపల్లి మండలం తాడూర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించి జాగిలం మృతదేహం వద్ద జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాగి లం జిల్లాలో అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత 14 సంవ్సతరాల నుంచి జిల్లాలో వీవీఐపీ, వీఐపీలు సందర్శించినపుడు స్నీపర్స్, బాంబులు, మందుపాతరలు గుర్తించడంలో చాకచక్యంగా వ్యవహరించి విధులు నిర్వహించిందని కొనియాడారు. 2010 సంవత్సరంలో తన హ్యాండ్లర్ మల్లేశంతో పాటు 8 నెలల పాటు ఐఐటీఏ మోయినాబాద్ నందు బేసిక్ ట్రేయినింగ్ పూర్తి చేసుకోని జిల్లాలో 14 సంవత్సరాలుగా సేవలు అందించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేష్, రాజా హ్యాండ్లర్ మల్లేశం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇంటికి నిప్పు


మంటలు అంటుకున్న ఇల్లు

తంగళ్లపల్లి, జూన్ 8: మద్యం మత్తులో భార్యతో గొడవపడిన భర్త ఇల్లు తగులబెట్టిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో శనివారం చోటు చేసుకుంది. తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌కు చెందిన ముడారి బాల పోచయ్య మద్యానికి బానిసై నిత్యం భార్యతో గొడవపడే వాడు. శనివారం సాయంత్రం మద్యం తాగి ఇంటికి చేరుకున్న బాలపోచయ్య అతడి భార్య రాజేశ్వరితో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం తలెత్తింది. మద్యం మత్తులో ఉన్న బాలపోచయ్య కోపోద్రిక్తుడై రాజేశ్వరి ఒంటిపై, అలాగే ఇంట్లో వస్తువులతోపాటు తనపై కిరోసిన్ పోసుకొని నిప్పుపెట్టే ప్రయత్నం చేశాడు. రాజేశ్వరి ఇంటి నుంచి బయటకు పరుగెత్తింది. ఆమె బయటకు వెళ్లడం తో ఆగ్రహంతో బయటికి వచ్చి ఇంటికి నిప్పు పెట్టాడు. మంటలు ఉవ్వెతున ఎగిసిపడడంతో స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బాల పోచయ్యను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

కొండగట్టులో భక్తుల సందడి


ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మల్యాల, జూన్ 8: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో సందడిగా మారింది. పాఠశాలల వేసవి సెలవులు ముగుస్తుండడం, వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

● **జనసేన నాయకుల పూజలు..**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో జనసేన ఘన విజయం సాధించడం, పిఠాపురం నుంచి పవన్‌కల్యాణ్ గెలుపొందడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జనసేన పార్టీ నాయకులు కొండగట్టు అంజన్నను దర్శించుకొని పూజలు చేశారు.. అంజన్న ఆశీస్సులతో విజయం సాధించామని తెలిపారు. కార్యక్రమంలో జనార్దన్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, అజయ్, రామారావు, గణేశ్, వెంకటేష్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

పాముకాటుతో బాలుడి మృతి

మల్లాపూర్, జూన్ 8: మల్లాపూర్ మండల కేంద్రంలో పాము కాటుతో మోతె జ్ఞానేశ్వర్(15)అనే బాలుడు మృతి చెందినట్లు శనివారం గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..మోతె జ్ఞానేశ్వర్ చిన్నతనంలో తల్లిదండ్రిని కోల్పోయాడు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ట్రస్టులో విద్యనభ్యసిస్తున్నాడు. వేసవి సెలవులు రావడంతో మల్లాపూర్‌లోని అమ్మమ్మ వద్దకు వచ్చాడు. శుక్రవారం ఇంటి ముందు ఆడుకుంటున్న సమయం లో పాము కాటు వేసింది. అలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు ఆసపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య


రాజవ్వ(ఫైల్)

కోనరావుపేట, జూన్ 8: కోనరావుపేట మండలం మందలపల్లె గ్రామానికి చెందిన అవురం రాజవ్వ(55) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అవురం రాజవ్వ కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. వైద్యుల సూచనల మేరకు ఐదేళ్లుగా మందులు వాడుతోంది. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మనోవేదన గురై శుక్రవారం రాత్రి కుటుంబసభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

గన్నేరువరం, జూన్ 8: మండలంలోని ఖాసింపేట గ్రామానికి చెందిన జక్కనపెల్లి రాయమల్లు(42) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయమలు గ్రామంలోని తన సోదరి రామంచ సత్తవ్వ నిర్మిస్తున్న నూతన గృహంలో ఫ్లోరింగ్ పనులను నిర్వహిస్తున్నాడు. ఆ సమయంలో మోటార్ వైర్ పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బంధువులు ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు నగలు కడిగి ఇస్తామని మోసం

- ఇద్దరికి గ్రామస్థుల దేహశుద్ధి

కోనరావుపేట, జూన్ 8: బంగారు ఆభరణాలను కడిగి ఇస్తామని మోసం చేయడానికి ప్రయత్నించిన ఇద్దరిని పట్టుకున్న గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం మలకపేట గ్రామంలోని కట్ల మల్లవ్వ ఇంటికి వెళ్లిన ఇద్దరు బంగారు గొలుసులను కడిగి ఇస్తామని చెప్పారు. దీంతో మల్లవ్వ బంగారు గొలుసును వారికి ఇచ్చింది. వారి వద్ద ఉన్న కెమికల్ పూయడంతో బంగారు గొలుసు నల్లబడింది. మల్లవ్వకు మత్తుమందు పెట్టే ప్రయత్నం చేయగా కేకలు వేసింది. గ్రామస్థులు ఇద్దరిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. గ్రామపంచాయతీ వద్ద బంధించి కోనరావుపేట పోలీసులకు అప్పగించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లి రూరల్, జూన్, 8: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మం డలంలోని ఆత్మనగర్ గ్రామం నుంచి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రెవెన్యూ అధికారి ఉమేశ్ తెలిపారు. శనివారం ఆత్మనగర్ గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమంగా మెట్‌పల్లికి తరలిస్తున్నట్లు సమాచారం మేరకు పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అదే విధంగా మల్లాపూర్ మండలం నుంచి అక్రమంగా మెట్‌పల్లికి తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తర లింపు, నిల్వ చేసిన, చెరువల నుంచి మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనకదుర్గ చిట్ ఫండ్ చైర్మన్ అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 8: గడువు ముగిసినప్పటికీ చిట్ డబ్బులు మొత్తం చెల్లించక పోగా, చిట్ సభ్యురాలును బెదిరింపులకు గురిచేసిన కనకదుర్గ చిట్‌ఫండ్స్ చైర్మన్ రాగిడి తిరుపతిరెడ్డి, అతడి అనుచరుడు రాజులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయకుమార్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా గీతానగర్‌కు చెందిన ప్రస్తుతం కరీంనగర్ సుభాష్‌నగర్‌లో నివాసముంటున్న గడ్డం జమున అనే మహిళ కరీంనగర్‌లోని ఐబీ చౌరస్తాలోని కనకదుర్గ ప్రయివేట్ చిట్ ఫండ్‌లో 3 లక్షల రూపాయల చిట్‌లో సభ్యురాలిగా చేరింది. ఆ చిట్‌కి సంబంధించిన పూర్తి మొత్తం చెల్లించింది. గడువు ముగిసిన అనంతరం తనకు రావాల్సిన డబ్బులు అడిగింది. హనుమకొండ జిల్లా గోపాలాపూర్‌కు చెందిన రాగిడి తిరుపతయ్య అలియాస్ తిరుపతిరెడ్డి, అతడి అనుచరుడైన రాజులు రెండు ఖాళీ బ్యాంకు చెక్‌లు అందచేశారు. ఆ ఖాతాల్లో డబ్బులు లేక బ్యాంకుల్లో ఆ చెక్‌లు బౌన్స్ అయ్యాయి. ఈ విషయం బాధితురాలు జమున చిట్ ఫండ్ చైర్మన్ తిరుపతిరెడ్డికి చెప్పగా డబ్బులు ఇవ్వడం కుదరదని చెప్పడమేగాక మరోసారి అడిగితే చంపేస్తామని బెదిరింపులకు గురిచేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ విజయ్ కుమార్ విచారణ అనంతరం చిట్ ఫండ్ చైర్మన్‌రాగిడి తిరుపతిరెడ్డిపై తెలంగాణ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సెక్షన్ 5 ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడికి రిమాండ్ విధించగా జైలుకు తరలించామని సీఐ తెలిపారు.

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం


లోక్ అదాలత్‌తో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు


లోక్ అదాలత్‌తో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి మంజుల


చిన్నారిని అప్పగిస్తున్న జడ్జి

కోల్‌సిటీ, జూన్ 8: లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం సాధ్యమని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు, గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్ మంజుల అన్నారు. ఈ మేరకు అదనపు జిల్లా న్యాయ స్థానం, మున్సిఫ్ కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం వేరువేరుగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కక్షలు, కారణాలతో సాధించేది ఏమీ లేదన్నారు. క్షణికావేశంతో కేసుల పాలై సమయం, డబ్బు వృధా చేసుకోరాదన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకున్న కేసులకు ఎలాంటి అప్పీల్‌కు అవకాశం ఉండదన్నారు. అనంతరం అదనపు జిల్లా న్యాయస్థానంలో మూడు, మున్సిఫ్ కోర్టులలో క్రిమినల్, మోటార్ ఆక్సిడెంట్ బీమా, వరకట్నవేధింపులు, సివిల్ కేసులలో రాజీ కుదుర్చారు. మున్సిఫ్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నంది రవీందర్, నహీద పర్వీన్, లోక్‌అదాలత్ సభ్యులు ఎన్ కిషన్‌రావు, గుర్రాల రాజేందర్, కొసనూరి సతీష్, గాదె శ్రీలత, న్యాయవాదులు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, జూన్ 8 : రాజీ మార్గమే రాజ మార్గమని జిల్లా కోర్టు న్యాయమూర్తి డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకుని జిల్లా కోర్టు ఆవరణలో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. కోర్టు పరిధిలో పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న పలు కేసులకు సంబంధించి కక్షిదారులు రాజీ కుదుర్చుకోవడంతో పలు దీర్ఘకాలిక కేసులు న్యాయమూర్తి పరిష్కరించారు. కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం గుడ్లపల్లి గ్రామానికి చెందిన గుడ్ల సతీష్‌కు పెద్దపల్లికి చెందిన కన్నం రమ్యతో 2016లో వివాహమయ్యింది. వీరికి ఒక కుమార్తె జన్మించిన తర్వాత చిన్నారి తల్లి రమ్య అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి చిన్నారి అమ్మ, తాత వద్ద ఉంటోంది. అయితే పాప తండ్రి తన కూతురిని అప్పగించాలని కోర్టును ఆశ్రయించాడు.కేసును విచారిస్తున్న న్యాయమూర్తి హేమంత్ కుమార్ ఇరువర్గాలకు కౌన్సెలింగ్ చేసి రాజీ కుదిర్చారు. దీంతో చిన్నారిని తండ్రికి అప్పగించేందుకు పాప తాత కన్నం మల్లేష్, అతని భార్య అంగీకరించారు. చిన్నారిని న్యాయమూర్తి సమక్షంలో అప్పగించారు. తన బిడ్డ నందికను అక్కున చేర్చుకుని తండ్రి సతీష్ కంటతడి పెట్టాడు. చిన్నారిని తండ్రికి అప్పగించేందుకు ఇరువర్గాలను రాజీ చేసేందుకు సహకరించిన న్యాయవాదులు ఆర్. సురేష్‌బాబు, శ్రీపతి సత్తయ్య, ఎస్.అశోక్, కోర్టుసిబ్బంది, ఇరు వర్గాలను పెద్దమనుషులను జిల్లా న్యాయమూర్తి హేమంత్‌కుమార్ అభినందించారు.



ధర్మారంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి వెంకట్‌సచిన్‌రెడ్డి

మంథని, జూన్ 8: స్థానిక కోర్టు భవనంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 269 కేసులు రాజీమార్గం ద్వారా శనివారం పరిష్కారం అయ్యాయి. పలు కేసుల్లో రూ. 1,10,820 జరిమానాగా విధించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ ధృవ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కే. రఘోత్తంరెడ్డి, ఏపీపీ ప్రణయ్, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ధర్మారం, జూన్ 8 : కక్షిదారులు తమ విలువైనా సమయం డబ్బును వృదా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని నందిమేడారం జూనియర్ సివిల్‌జడ్జి వెంకట్‌సచిన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నందిమేడారం జూనియర్ సివిల్ కోర్టులో శనివారం లోక్‌అదాలత్ కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా సివిల్‌జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు మధ్యవర్తుల ప్రమేయంతోగాని, స్వయంగా కాని ఒకరికొకరు మాట్లాడుకొని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నార అశోక్‌రెడ్డి, రాజేశం, లక్ష్మీనర్సయ్య, సత్యనారాయణ, ప్రకాష్, సంపత్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, లింగారెడ్డి, సరిత, రజిత, కొమురయ్యలతో పాటు పలువురు కక్షిదారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 8: సింగరేణి ఉద్యోగాల భర్తీ కోసం ఉద్యోగార్థులు సింగరేణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్టు జీఎం వెల్ఫేర్ ప్రకటనలో పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఈఅండ్‌ఎం, సిస్టమ్స్ ఎలక్ట్రికల్), అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(మెకానికల్), ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ ట్రైనీ ఖాళీల భర్తీ కోసం మార్చి 15న ఇచ్చిన ఏప్రిల్ 15 నుంచి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్టు తెలిపారు. సింగరేణి పోర్టల్ సాంకేతిక కారణాల వలన దరఖాస్తుల స్వీకరణ వాయిదా పడిందని, ఈనెల 10వ తేదీ నుంచి సింగరేణి పోర్టల్‌ను తిరిగి ప్రారంభించనుననట్టు జీఎం తెలిపారు. 10వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్కేపీ సీఎస్పీలో ప్రత్యేక రక్షణ డ్రైవ్

రామకృష్ణాపూర్, జూన్ 8: జీఎం సేఫ్టీ గురువయ్య ఆదేశాల మేరకు శనివారం ఆర్కేపీ సీఎస్పీలో ప్రత్యేక రక్షణడ్రైవ్ నిర్వహించారు. ఏరియారక్షణాధికారి రవిందర్, ఇంజనీర్ నాగరాజు మాట్లాడుతూ ఆటిట్యూడ్, బిహేవియర్, కల్చర్, డిసిప్లేన్ (ఏబీసీడీ)లను సక్రమంగా పాటిస్తే రక్షణలో జీరో హార్మ్ సాధించవచ్చని తెలిపారు. క్విజ్‌పోటీల్లో గెలుపొందిన కార్మికులకు బహుమ తులు అందజేశారు. సీఎస్పీ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఈఈ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు : డీఈవో



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ మాధవి

సుల్తానాబాద్, జూన్ 8: జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామని జిల్లా విద్యా శాఖ అధికారి మాధవి అన్నారు. మండలంలోని ఐతరాజుపల్లి గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యా శాఖ అధికారి ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామంలో బడి ఈడు పిల్లల గురించి ఆరా తీసి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలను మెరుగుపరిచామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించడంతో అధునిక బోధన పరికరాలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన సదుపాయాలు ఉన్నాయని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన చేయిస్తున్నారని, దానికి తోడు రుచికరమైన మధ్యాహ్న భోజనం, అల్పాహారం, ఉచితదుస్తులు, పుస్తకాలు, నోట్ బుక్కులు అందించడం జరుగుతుందని వివరించారు. ప్రతీ నెల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి వారి పిల్లల ప్రగతి గురించి వివరించడం జరుగుతుందన్నారు. ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తమ పిల్లలను మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దుకోవాలన్నారు. గ్రామంలో పలువురు బడి ఈడు గల వారిని గుర్తించి వారికి పాఠశాలల్లో చేర్పించుకునే ప్రవేశ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సురేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో బట్టి విధానంలో మాత్రమే విద్యను అందిస్తారని అన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించాలని ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలని, ఆ బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రుల మీద ఉందన్నారు. కాగా ఐతరాజుపల్లిలో అమ్మ అదర్శ పాఠశాల పనులు వంద శాతం పూర్తి చేసినందులకు ఏఏపీసీ చైర్ పర్సన్ స్వప్న, హెచ్‌ఎం బుచ్చిరెడ్డి ఉపాధ్యాయులను డీఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌వో దివాకర్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కవిత, కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గని ప్రమాదాలపై విచారణ జరపాలి

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి


ప్రశాంత్‌ను పరామర్శిస్తున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, జూన్ 8: సింగరేణి బొగ్గుగనుల్లో జరుగుతున్న ప్రమాదాలపై బహిరంగ విచారణ జరపాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఓసీపీ-3 గని ప్రమాదంలో గాయపడిన ప్రశాంత్‌ను గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో పరామర్శించారు. అనంతరం ఆయన తీవ్రంగా స్పందించారు. అధికారుల నిర్లక్ష్యం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో రామగుండం రీజియన్‌లో ప్రమాదాలు పెరిగిపోయాయని, జీడీకే11 ఇంక్లైన్, ఓసీపీ-3లలో వరుస ప్రమాదాలు జరిగాయని, అదేవిధంగా ఓసీపీ-1లో కాంట్రాక్టు కార్మికుడు ప్రమాదానికి గురయ్యాడని తెలిపారు. మైనింగ్ నిబంధనలకు విరుద్ధంగా పనులు నిర్వహించడం వల్ల ప్రమాదాలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులపై చర్యలు తీసుకొని, అధికారులపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదన్నారు. 11వ గని ప్రమాదంలో మైనింగ్ సూపర్‌వైజర్లపై క్రమశిక్షణ చర్యలను తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. అలాగే ఓసీపీ-3 సీహెచ్‌పీలో ప్రమాదవశాత్తు గాయపడిన ఎస్ ఐలయ్యను ఆయన ఇంటి వద్ద పరామర్శించారు. రాజిరెడ్డి వెంట టీబీజీకేఎస్ నాయకులు, నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, చల్ల రవీందర్‌రెడ్డి ఉన్నారు.

కాసిపేట గనిపై సౌకర్యాలు కల్పించాలి

కాసిపేట, జూన్ 8: కాసిపేట 2వగనిలో కార్మికులకు కనీససౌకర్యాలు కల్పించాలని ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య అన్నారు. శనివారం బాయిబాటలో భాగంగా కాసిపేట2వ గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గనిలో షెడ్డు లేక లక్షల రూపాయల విలువైన వస్తువులు ఎండకు ఎండి వానకు తడిసి తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయన్నారు. వెల్డర్, టబ్ సెక్షన్ పనులు షెడ్డులేక ఎండలోనే చేస్తూ అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. గనిపై టాయి లెట్లు లేక కార్మికులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో దేవి భూమయ్య, చంద్రశేఖర్, తిరుపతి, పరమేశ్వర్, కుమార్, రవికుమార్, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, జూన్ 8: సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలకు పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్-30, కంప్యూటర్-30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్-30, మెకానికల్-30, మైనింగ్-30 విభాగాల్లో మొత్తం 150సీట్లు ఉన్నాయన్నారు. పాలిసెట్-2024లో అర్హత పొందిన విద్యార్థులు ఈనెల 28వ తేదీ లోగా సింగరేణి పాలిటెక్నిక్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చేపల మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి


ఖని మార్కెట్‌లో చేపలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలు


సుల్తానాబాద్‌లో..

కళ్యాణ్‌నగర్, జూన్ 8: మృగశిరకార్తె సందర్భంగా శనివారం గోదావరిఖనిలో చేపల కోసం జనం ఎగబడ్డారు. రామగుండం పారిశ్రామిక ప్రాంత చుట్టు చెరువుల నుంచి గోదావరిఖని చేపల మార్కెట్, గాంధీనగర్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్, తిలక్‌నగర్, విఠల్‌నగర్, ఫైవింక్లయిన్ చౌరస్తా, జీఎం కాలనీ, ఉదయ్‌నగర్‌లలో భారీగా చేపలను తీసుకువచ్చి విక్రయించారు. సాధారణ రోజుల్లో రూ.450 నుంచి రూ.500పలికే బొమ్మ చేపలు రూ.600లకు కిలో పలుకగా రవులు, పాపర్లు, బొచ్చెలు, చందమామ, బంగారు తీగ, కొర్రమట్టలు కిలో రూ.300వరకు పలికాయి. వీటిని కొనుగోలు చేయడం కోసం జనం ఎగబడ్డారు.

చౌరస్తాలో చేప ప్రసాదం పంపిణీ

దగ్గు, ఆస్తమా, ఆయాసం, గురుక నివారణ కోసం ప్రతిఏటా గోదావరిఖని చౌరస్తాలో బోనగిరికి చెందిన ఆయుర్వేద వైద్యుడు పరుశరాములు శనివారం ఉదయం 6గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ చేశారు. ఈ చేప మందు తీసుకోవడానికి వివిధ ఏరియాల నుంచి తరలివచ్చి చేప ప్రసాదం స్వీకరించారు. గత 30 ఏళ్లుగా గోదావరిఖని చౌరస్తాలో తమ కుటుంబం చేప ప్రసాదం విక్రయిస్తున్నట్టు వైద్యుడు పరుశరాం తెలిపారు.

సుల్తానాబాద్, జూన్ 8: మృగశిర కార్తె సందర్భంగా సుల్తానాబాద్ మార్కెట్‌లో చేపలకు డిమాండ్ ఏర్పడింది. మృగశిర కార్తె రోజున పలుచోట్ల చేప మందు పంపిణీ చేస్తారు. ఆ రోజున చేపలు తినాలని పెద్దలు చెబుతుంటారని, దాంతో తాము చేపల కోసం మార్కెట్‌కు వచ్చినట్టు పలువురు తెలిపారు. సుల్తానాబాద్ చేపట మార్కెట్‌లో శనివారం ఉదయం నుంచి చేపలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అందుకు తగ్గట్టుగానే చేపల విక్రేతలు కూడా స్టాక్ తెచ్చి పెట్టారు. జీవించి ఉన్న చాపలకు మార్కెట్‌లో ఆదరణ ఉండడంతో చాలా మంది పెద్ద పెద్ద ట్యాంకులలో నీరు నింపి అందులో చేపలు నిల్వ చేసి వాటికి కృత్రిమంగా ఆక్సిజన్ అందే ఏర్పాటు కూడా చేశారు. కొనుగోలుదారులు రావడంతోనే ట్యాంకుల్లో ఉన్న చేపలను తీసి లైవ్‌గా విక్రయిస్తున్నారు. మామూలు రోజుల్లో వంద నూటయాభై రూపాయలకు కిలో ఉన్న మామూలు చేపలు శనివారం రెండు వందల నుంచి మూడు వందల వరకు పెరిగింది. ఒక బొమ్మె చేపలు మామూలు రోజుల్లో నాలుగు వందలకు కిలో ఉండగా ఐదు ఆరు వందల రూపాయలకు కిలో చొప్పన విక్రయించారు. వినియోగదారుల డిమాండ్ మేరకు మార్కెట్‌లో చేపలను అప్పటికప్పుడు చుట్టుపక్కల చెరువులు కుంటల నుంచి తెచ్చి విక్రయిస్తున్నారు. దాంతో చేపల కోసం ఇటు వినియోగదారులు అటు విక్రేతలతో చేపల మార్కెట్ సందడి సందడిగా ఉంది.

ఓవెల్స్ పాఠశాలలో తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 8: నగరంలోని ఓవెల్స్ పాఠశాలలో తైక్వాండో కలర్ బెల్టు గ్రేడింగ్ పరీక్షలను నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ పరీక్షల్లో 50 మంది బాలబాలికలు పాల్గొని ప్రతిభను కనబరిచి పలు రకాల బెల్టులను కైవసం చేసుకున్నారు. పరీక్షల అధికారిగా తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి జి.సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం తిరుపతిరెడ్డి పాల్గొని విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బెల్టులను అందించి మాట్లాడారు. నేటి సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలకు ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరమని అన్నారు. యుద్ధ విద్యల ద్వారా విద్యార్థులు ధైర్యంతో ముందుకు సాగుతారని అన్నారు. ఈకార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.సంతోష్, ఉపాధ్యక్షుడు పెండ్లి రాజేందర్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి నేవూరి సతీష్‌కుమార్, కోచ్‌లు సోయబ్, రమ్య, కిరణ్, కరుణాకర్, శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై అవగహన

గణేశ్‌నగర్, జూన్ 8 : గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్షకు హాజరు కాబోతున్న ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు కరీంనగర్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి నాగార్జున, జిల్లా యూత్ ఆఫీసర్ రాంబాబు పరీక్ష కేంద్రంలో పాటించాల్సిన మెలకువలు, సమయపాలన గురించి తెలియజేశారు. అదేవిధంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలు, సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎన్టీయూను సందర్శించిన అదనపు కలెక్టర్


కళాశాలను సందర్శించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

రామగిరి, జూన్ 8: మండలంలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల (మంథని)లో ఏర్పాటు చేసిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాన్ని శనివారం అదనపు కలెక్టర్ అరుణశ్రీ సందర్శించారు. అభ్యర్థులు ఎవరు ఇబ్బందులు పడకుండా చూడాలని కేంద్రాల అధికారులను ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలియజేసిన సూచ నలను తప్పనిసరిగా పాటించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, రీజనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. లక్ష్మీనర్సయ్య, టీజీపీఎస్సీ అజయ్‌కుమార్, రామగుండం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయండి


వాటర్ ప్లాంట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ రజిత

కళ్యాణ్‌నగర్, జూన్ 8: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని విఠల్‌నగర్‌లో సింగరేణి యాజమాన్యం నిర్మిస్తున్న వాటర్ ప్లాంట్ తొమ్మిది నెలలు అవుతున్నా పూర్తి కాలేదని సింగరేణి యాజమాన్యంపై 12వ డివిజన్ కార్పొరేటర్ బొడ్డు రజితరవీందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణంలో వాటర్ ప్లాంట్ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభానికి జీఎం చొరవ చూపాలని లేకపోతే జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో పొరండ్ల నారాయణ, గుమ్మడి లచ్చయ్య, కుమ్మరి మల్లయ్య, మల్లమ్మ, సుగుణమ్మ, రాజం, పోషం, తేజ, చరణ్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ


పూజలో పాల్గొన్న భక్తులు

పాలకుర్తి,జూన్ 8: మండలం పరిధిలోని ఘన్‌శ్యామ్ ధాస్ నగర్‌లో బొడ్రాయి బోనాలను ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామంలో ప్రతి ఇంటి నుంచి బోనాల ఊరేగింపు నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల మధ్య బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంపతులు సూర సమ్మయ్య, సునీతతో పాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు కేశోరాం యాజమాన్యం సుముఖం

పాలకుర్తి, జూన్ 8: గత కాంట్రాక్టు కార్మిక సంఘం కాల పరిమితి ముగిసినందున కొత్త యూనియన్ గుర్తింపు కోసం సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎన్నికల నిర్వహణకు కేశోరాం యాజమాన్యం సుముఖత వ్యక్తం చేసిందని మేనేజర్ పి.పార్థసారధి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శి పదవిపై ఆసక్తి ఉన్న కార్మికులు సోమవారం సాయంత్రం 5 గంటలకు ఫ్యాక్టరీ మేనేజర్ కార్యాలయంలో ఎన్నికల విధి విధానాలపై జరిగే సమావేశానికి హాజరు కావాలని మేనేజర్ తెలిపారు.

మృతుడి కుటుంబానికి చేయూత

కాల్వ శ్రీరాంపూర్, జూన్ 8: నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన పెంద్యం నగేష్ ఇటీవల మృతి చెందడంతో పెద్దపెల్లి జిల్లా పద్మశాలి సేవా సంఘం అడక్ కమిటీ చైర్మన్ వలస నీలయ్య ఆధ్వర్యంలో మృతిని కుటుంబానికి క్వింటాల్ బియ్యాన్ని అందించారు. శనివారం మృతిని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సబ్బని రాజమల్లు, పెగడ చందు, ఆడెపు అంబదాస్, గాదాసు రవీందర్, మాజీ సర్పంచ్ ఆడెపు రాజు, ఆడెపు శ్రీనివాస్, కాల్వ శ్రీరాంపూర్ అధ్యక్షులు గోలి సుధాకర్, ఓడ్నాల శ్రీనివాస్, రాజయ్య, నరసయ్య, రమేష్, కాసర్ల శ్రీనివాస్, ఎనగందుల సంతోష్, వడ్డేపల్లి వెంకన్నలతో పాటు మృతుని కుటుంబ సభ్యులు, పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలను పరిష్కరించా'


మాట్లాడుతున్న సూర సమ్మయ్య

పాలకుర్తి, జూన్ 8: తనపై నమ్మకంతో గత ఎన్నికల్లో కేశోరాం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కార్మికుల సమస్యలను పరిష్కరించానని సంఘం యూనియన్ అధ్యక్షుడు సూర సమ్మయ్య అన్నారు. తన పదవీ కాలం ముగియడంతో పాటు రానున్న ఎన్నికల్లో తిరిగి పోటీ చేయనున్న సమ్మయ్య శనివారం కర్మాగారం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మికులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ యూనియన్ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

వైష్ణవ విద్యార్థుల ప్రతిభా పురస్కారాలకు ఆహ్వానం

సుల్తానాబాద్, జూన్ 8: తెలంగాణ శ్రీ వైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏటా ఇస్తుననట్లుగానే ఈ ఏడాది పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాందూరి వాసు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు తమ పేరు, తండ్రి పేరు, చిరునామా, సాధించిన మార్కుల జాబితా ను జత చేస్తూ ఈనెల 30 లోగా అధ్యక్షులు, శ్రీ వైష్ణవ సేవా సంఘం, శ్రీ వైష్ణవ సదనం, రోడ్డు నంబర్ 5, చంద్రపురి కాలనీ, ఎల్బీనగర్ హైదరాబాద్ చిరునామాకు పంపించాలని వాసు పేర్కొన్నారు.

న్యూడెమోక్రసీ కమిటీల ఎన్నిక

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 8: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా, డివిజన్ కమిటీలను శనివారం ఎన్నుకున్నారు. కాలనీలో ఎం శ్రీనివాస్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. జిల్లా కార్యదర్శిగా ఈదునూరి రామకృష్ణ, డివిజన్ కార్యదర్శిగా ఈసంపల్లి రాజేందర్‌లను ఎన్నుకున్నారు. ఈసమావేశంలో రాజేశం, మల్లేశం, దేవయ్య, ప్రసాద్, మహిపాల్, మనోజ్ పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కమాన్‌పూర్, జూన్ 8: మండలంలోని లింగాపూర్ గ్రామంలో శనివారం తాటి చెట్టుపై నుంచి గీత కార్మికుడు ఉయ్యాల గంగయ్యగౌడ్‌కు గాయాలయ్యాయి. తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారటంతో కిందపడటంతో కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజేశం

పెద్దపల్లి టౌన్, జూన్ 8: బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు జూలపల్లి మండలం వడుకాపూర్ గ్రామానికి చెందిన రంగు రాజేశంను బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించామని జిల్లా అధ్యక్షుడు నోమూరి శ్రీధర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజేశం మాట్లాడుతూ బీసీ కులాలను ఏకం చేసి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని అన్నారు.

రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరని లోటు

పెద్దపల్లి టౌన్, జూన్ 8: ఈనాడు పత్రిక వ్యవస్థాపకులు చెరుకూరి రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరని లోటు అని టీయుడబ్ల్యూజే జిల్లా శాఖ అధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఆయనతో పాటు నేషనల్ కౌన్సిల్ మెంబర్ మల్లవజుల వంశీ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

● కమాన్‌పూర్: రామోజీరావు అందించిన సేవలు వేలకట్టలేనివని కమాన్‌పూర్ మండల పాత్రికేయులు అన్నారు.